అక్షయ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కలెక్టర్‌ను కలిసిన అక్షయ తల్లిదండ్రులు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 22 : భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన కాజీపేట నరేశ్-సుమలత దంపతులు కూతురు అక్షయతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ భవేశ్‌మిశ్రాను కలిశారు. రెండు కాళ్లు కాలిపోయి నడవలేని స్థితిలో ఉన్న అక్షయ పరిస్థితిని తెలుసుకొని ఆమెకు మెరుగైన వైద్య సేవలందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షయ వైద్యానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తక్షణమే అక్షయను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అక్కడ కాకపోతే హైదరాబాద్‌కు తీసుకెళ్లి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలని, చిన్నారి ఆరోగ్యం మెరుగుపడే వరకు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.

డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది

డ్రైనేజీలను శుభ్రం చేసిన జీపీ సిబ్బంది

■ 'నమస్తే' కథనానికి స్పందన ■ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన

మహదేవపూర్, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని గొల్లవాడకాలనీ డ్రైనేజీలను జీపీ సిబ్బంది సోమవారం శుభ్రం చేశారు. ఈ నెల 22న 'నమస్తే తెలంగాణ'లో 'మహదేవపూర్‌లో పారిశుధ్య లోపం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని జీపీ సిబ్బంది తొలగించారు. మురుగు నీరు రోడ్డు పైకి రాకుండా చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీలు, రోడ్డుపై చెత్తాచెదారం వేయకూడదని ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఏటూరునాగారం, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని జాతీయ రహదారి వై జంక్షన్‌లో బైక్‌పై మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ సిబ్బంది సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పస్రా నుంచి వాజేడు మండలం గణపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై కుమ్మరి గోపీచంద్ అక్ర మంగా మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు సీఐ చెప్పారు. దాని విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. బైక్, మద్యం స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో నాటుసారా విక్రయించే 11 మందిని ఆయా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది తిరుపతి, నవీన్, నాగ రాజు, ప్రణయ్, శ్రీనివాస్, ప్రవళిక, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్ల నీడన కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న రైతు

'హరిత' నీడలో కూరగాయల విక్రయం

మహదేవపూర్, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని బొమ్మాపూర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా నాడు కేసీఆర్ ప్రభుత్వం నాటిన మొక్కలు వృక్షాలుగా మారి చల్లని నీడనిస్తున్నాయి. మండు వేసవిలో వాహనదారులు, బాటసారులకు నీడతో పాటు చల్లని గాలిని ఇస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి అనే రైతు తన సొంత భూమిలో సాగవుతున్న కూరగాయలను ఈ చెట్ల నీడలో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ దారిగుండా వెళ్లే ప్రజలు కూరగాయలు కొనుక్కోవడంతో పాటు చెట్ల నీడలో కొద్దిసేపు సేదదీరుతున్నారు. 'హరిత' నీడలో తాజా కూరగాయలు అమ్ముతున్న రైతును అభినందిస్తున్నారు.

ఆర్థిక సాయం

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 22 : మండలంలోని యాకన్నగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి సోమవారం కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ రూ.11 వేలు బాధిత మహిళ రాణికి ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రావు, నాయకులు ఎడ్ల క్రాంతి, రమేశ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఏటూరునాగారం, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఉద్యోగులు రవీందర్, వెంకన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **SAVURE KAMALA** (New Name), previously called **MODE RAJITHA** (Old Name), and residing at H.No. 1-68, Peddapur Village, Athmakur Mandal, Hanumakonda Dist.-506342, T.S., India. and solemnly declare.

WANTED

jobs Apply Now!

★Wanted PRO's for degree College admissions (22 years Experience College). Contact Immediatly. Cell: 8121554649

NTW-323199

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కవిత గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

■ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి
■ ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

ములుగు, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కే లక్ష్మీనర్సింహారావులతో కలిసి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ విషయాలపై ఆమె చర్చించి కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో అధిక పార్లమెంట్ స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహపడొద్దన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ గెలుపు దిశగా ఉందని, మాలోత్ కవిత గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

నేటి నామినేషన్‌కు తరలిరావాలి : జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత నేడు నామినేషన్ వేయనున్నందున కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. ఉద్యమనేత కేసీఆర్ ప్రజలు మెచ్చే పాలన అందించారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గందరగోళ పాలన సాగిస్తుందని తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండాను ఎగురవేయాలని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

దశలవారీగా కొనుగోళ్లు ■ భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గిద్దెముత్తారంలో వడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చిట్యాల, ఏప్రిల్ 22 : ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మండలంలోని అందుకుతండా, గిద్దెముత్తారం గ్రామాల్లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని, వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు మద్దతుగా నిలిచేందుకు జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనీస మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలని, ఎవరైనా తక్కువకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులు మూకుమ్మడిగా కాకుండా దశల వారీగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సందీప్, పీఏసీఎస్ సీఈవో మొగిలి, సెంటర్ ఇన్‌చార్జిలు రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎమ్మెల్సీ సత్యవతి వాహనం తనిఖీ

ములుగురూరల్, ఏప్రిల్ 22 : ఎన్నికల కోడ్ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ వాహనాన్ని సోమవారం మల్లంపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అనంతరం మార్గ మధ్యంలోని గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించి ములుగుకు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో ఫోన్ అందిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

తాడ్వాయి, ఏప్రిల్ 22 : మేడారం జాతర సందర్భంగా అమ్మవార్ల దర్శనానికి భక్తులు సెల్ ఫోన్లు పోగొట్టుకోగా ఫిర్యాదు చేసిన బాధితులకు సోమవారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అప్పగించారు. నిర్మల్, మంచిర్యాలకు చెందిన దశరథం, పవన్‌కల్యాణ్ ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు ఐఎమ్ఈఐ నంబర్ ఆధారంగా ట్రేస్ ఔట్ చేసి మొబైల్స్‌ను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. మిగతా వారి ఫోన్లను త్వరలోనే కనిపెట్టి అందజేస్తామన్నారు.

కుందయ్యపల్లిలో రెండు ఆవుల అపహరణ

గణపురం, ఏప్రిల్ 22: మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధి కుందయ్యపల్లి గ్రామ రైతు వేములపల్లి కట్టమల్లుకు చెందిన రూ. 80 వేల విలువ గల రెండు ఆవులను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మేతకు వెళ్లి వచ్చిన రెండు ఆవులను ఇంటి ఆవరణలో కట్టివేశారు. తెల్లవారుజామున చూసేసరికి ఆవులు కనబడలేదని, వాటిని కట్టివేసిన పరిసరాల్లో బొలెరో వాహనానికి సంబంధించిన టైర్ల గుర్తులు ఉండడంతో ఆందోళన చెందిన బాధితుడు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

చికిత్స పొందుతూ జీపీ కార్యదర్శి మృతి

శ్రావణి (ఫైల్)

గణపురం, ఏప్రిల్ 22 : మండలంలోని కర్కపల్లి పంచాయతీ కార్యదర్శి పల్లెబోయిన శ్రావణి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆదివారం ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించిన విషయం తెలిసిందే. 24 గంటల పాటు చికిత్స అందించినప్పటికీ ప్రాణాపాయ స్థితి నుంచి ఆమె బయట పడలేదు. ఈ ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఆదివారం ఉదయం ఆమె ఎవరెవరితో ఫోన్లో మాట్లాడారనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆమె మృతికి సంబంధించిన కారణాలు తెలియలేదని ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపారు. మృతురాలికి భర్త నరేశ్‌తో పాటు పాప, బాబు ఉన్నారు. శ్రావణి మృతికి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం సంతాపం తెలిపింది.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌ను ఓడించాలి

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 22 : ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. సోమవారం వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలుపును కోరుతూ భూపాలపల్లి పట్టణంలోని 17వ వార్డు సుభాష్‌కాలనీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఇచ్చిన హామీలను పక్కకు పెడుతుందన్నారు. కార్యక్రమంలో తాండ్ర హరీశ్, అర్జున్, కార్తీక్, శ్రీనివాస్, సంతోష్, రాజేశ్, శ్రీకాంత్, వేణు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో మంగీలాల్

కొండంపల్లి గ్రామస్తులకు న్యాయం చేస్తాం

భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ ■ బాధితుల దరఖాస్తులు పరిశీలన

గణపురం, ఏప్రిల్ 22 : సింగరేణి ఓసీ 3లో ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న కొండంపల్లి గ్రామస్తులకు న్యాయం చేస్తామని భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ అన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో ఇండ్లు కోల్పోతున్న వారి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను రోజువారీగా పరిశీలించిన అనంతరం నివేదిక తయారు చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్లైలు దేవేందర్, రహీంపాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు సూచనలిస్తున్న ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ములుగు ఎస్పీ

మంగపేట, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతం బ్రాహ్మణపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును సోమవారం సాయంత్రం ములుగు ఎస్పీ శబరీశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఇరువైపుల నుంచి వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీ మహేశ్ జీ బాబాసాహెబ్, సీఐ రాజు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

వాహనాలు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

ఏటూరునాగారం, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలో సోమవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పలు చోట్ల తనిఖీలు చేపట్టింది. ఏటూరునాగారం నుంచి ఇతర ప్రాంతాలకు వచ్చి వెళ్లే వాహనాల్లో సోదాలు చేశారు. భద్రాచలం, ఛత్తీస్‌గడ్, చర్ల, వెంకటాపురం వైపు వెళ్లే వాహనాలతో పాటు హనుమకొండ వైపు వెళ్తున్న వాహనాలను నిలిపివేసి తనిఖీ చేశారు. స్క్వాడ్ ఇన్‌చార్జి, డీఈఈ శరత్ బాబు, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ నర్సింగరావు, జూనియర్ అసిస్టెంట్ గంపల శంకర్ పాల్గొన్నారు.

రైతులను ముంచిన 'అంకుర్ సీడ్స్'

గణపురం, ఏప్రిల్ 22 : అధిక దిగుబడి వస్తుందని వరి పంట సాగుచేసిన రైతులు మోసపోయారు. దళారుల మాయమాటలు నమ్మి నట్టేట మునిగారు. అన్నదాతల ఆశను ఆసరాగా చేసుకున్న 'అంకుర్ సీడ్స్' ప్రతినిధులు రైతుల నడ్డి విరిచారు. వివరాల్లోకి వెళితే అంకుర్ సీడ్స్‌కు చెందిన కొందరు దళారులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని పలువురు రైతులను కలిశారు. 130 రోజుల పంట కాలం, మంచి దిగుబడి వచ్చే సీడ్‌ను సాగుచేయాలని, ధాన్యాన్ని అత్యధిక ధరకు తామే కొనుగోలు చేస్తామని నమ్మబలికారు. దీంతో 23 మంది రైతులు 86 ఎకరాల్లో వరి పంట వేశారు. అయితే మొక్క పెరగక పోగా 60 రోజులకు రావాల్సిన పొట్ట దశ 35 రోజులకే వచ్చింది. 60 రోజుల్లోనే పంటకాలం పూర్తికాగా, గొలుసు పెరగకపోవడంతో ఆశించిన మేర దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా వరి పంట ఎకరాకు 40 బస్తాల మేర దిగుబడి వస్తుందని, దీనికన్నా ఎక్కువగా వస్తుందని చెప్పడంతో ఆశపడి అంకుర్ సీడ్స్ సాగుచేశామని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎకరానికి ఆరు బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తమ పొలాల చుట్టూ ఉన్న రైతులు 130 రోజుల పంట వేయడంతో ఇప్పుడు వరి కోయలేని పరిస్థితి ఉందని, దీంతో మొత్తానికే నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. ఇదే విషయమై కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించామని, అప్పటి నుంచి తమ ఫోన్లు ఎత్తకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సోమవారం రైతులు దండు రాములు, దయ్యాల భద్రయ్య, మల్లయ్య, వడ్లకొండ దుర్వాసులు, వడ్లకొండ తిరుపతి, మామిండ్ల సారంగపాణి, పొట్లూరి సురేష్, రవి కుమార్ స్థానిక ఎస్సై మచ్చ సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. తమవెంట తీసుకెళ్లిన వరి కంకులను చూపించారు. వెంటనే స్పందించిన ఆయన కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసి రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అంకుర్ సీడ్స్ వరితో నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, ఏప్రిల్ 22 : ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం వారు అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూపాలపల్లిలో భూ సమస్యలు, పెన్షన్ తదితర సమస్యలపై 36, ములుగులో 18 అర్జీలు వచ్చాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పంపించామని వారు తెలిపారు. పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిష్కరించిన వాటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని కలెక్టర్లు సూచించారు. ములుగు డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అప్పయ్య, సివిల్ సప్లై డీఎం రాంపతి, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రవి, డీఏవో విజయ్‌చందర్, డీఈవో పాణిని, డీపీఆర్వో రఫీక్ ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

24న ఆలయ భూమి కౌలుకు వేలం

ఏటూరునాగారం, ఏప్రిల్ 22 : మండల కేంద్రలోని శ్రీఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ భూమి కౌలుకు ఈ నెల 24న వేలం పాట నిర్వహించనున్నట్లు చైర్మన్ మడుగూరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది భూమి కౌలుకు ఇచ్చేందుకు కమిటీ తీర్మానం చేసిందన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం పది గంటలకు వేలం ఉంటుందన్నారు. రైతులు పాల్గొని పంట సాగు చేసేందుకు వేలాన్ని దక్కించుకోవాలన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడొద్దు : డీఎంహెచ్‌వో

ములుగురూరల్, ఏప్రిల్ 22 : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడొద్దని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదల అవుతున్న దృష్ట్యా మానసిక ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు జిల్లాలో అందిస్తున్న టెలీ మానస సేవలు ఉపయోగించుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేయాలని తెలిపారు. జిల్లా దవాఖానలో ప్రత్యేక మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు. కౌన్సెలింగ్ సేవలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

రెండు మండలాల కోఆర్డినేటర్ల నియామకం

పీ శ్రీనివాస్

ములుగురూరల్, ఏప్రిల్ 22 : ములుగు, గోవిందరావుపేట మండలాల బీఆర్ఎస్ ఎన్నికల కో ఆర్డినేటర్లను నియమించినట్లు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు సోమవారం తెలిపారు. ములుగు మండల కో ఆర్డినేటర్‌గా మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు పాలెపు శ్రీనివాస్, గోవిందరావుపేట మండల కో ఆర్డినేటర్‌గా సీనియర్ నాయకుడు నర్సింహనాయక్‌ను నియమించినట్లు చెప్పారు. రెండు మండలాల్లో పార్టీ మండల అధ్యక్షులు లేకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండేందుకు వీరిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాలెపు శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, సీనియర్ నాయకులు గోవిందనాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్, జడ్పీటీసీ సకినాల భవాని, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆశాజ్యోతి

వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

టేకుమట్ల, ఏప్రిల్ 22 : ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మండల ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆశాజ్యోతి సూచించారు. సోమవారం ఆమె వెలిశాలలోని ఆదర్శ గ్రామైక్య మహిళా సంఘం సభ్యులకు వడదెబ్బ తగలకుండా, తగిలిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీవోఏ సుమతి, వైద్య సిబ్బంది మధురిత, జమాలుద్దీన్, కృష్ణారెడ్డి, సతీశ్, సంగీత, రాజ్యలక్ష్మి, కోమల, రమేశ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

కాటారం, ఏప్రిల్ 22 : శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ చేస్తున్నామని ఎస్సై అభినవ్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని దేవరాంపల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 35 వాహనాలు, నంబర్ ప్లేట్లు లేని మరో 8 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. అపరిచితులు గ్రామంలోకి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.తనిఖీలో మల్లర్, మహాముత్తారం ఎస్సైలు నరేశ్, మహేందర్, కాటారం ఎస్ఐ-2 హరిశేఖర్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు